క్లుప్తంగా

అనుమానంతో భార్యపై దాడి

తర్లుపాడు: అనుమానంతో తనపై భర్త దాడి చేశాడని మార్కాపురం మండలం దరిమడుగు గ్రామానికి చెందిన కె.భవాని గురువారం మార్కాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. భవానీకి తర్లుపాడు మండలం రాగసముద్రం గ్రామానికి చెందిన వెంకటరావుతో వివాహమైంది. అయితే భర్త గత ఫిబ్రవరిలో మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. పట్టణానికి చెందిన శ్రీహరితో పరిచయం కాగా ఇటీవలే తనను పెళ్లిచేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. బుధవారం తాను పెద్దారవీడు మండలం కుంటలో వంట చేసేందుకు వెళ్లి వస్తుండగా తన భర్త శ్రీహరి తనను ఆటోలో నుంచి దించి బైక్‌పై ఎక్కించుకుని గొబ్బూరు వద్దకు రాగానే తీవ్రంగా కొట్టాడని తెలిపింది. అనంతరం ఇంటికి రాగా మళ్లీ కొట్టాడని ఫిర్యాదులో పేర్కొంది. విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో వారు జీజీహెచ్‌లో చేర్పించారు. మార్కాపురం పట్టణ పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

కంభం: ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసులు సూచించారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా గురువారం కందులాపురం ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రణాళికలు రూపొందించాలని, విద్యా పథకాలను ప్రచారం చేస్తూ పాఠశాలల ప్రగతికి శ్రీకారం చుట్టాలని తెలిపారు. నూతన విద్యాసంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయులు తయారు చేసిన కరపత్రాలను పరిశీలించారు. పాఠశాలలో వసతులు, సౌకర్యాలు, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొమరోలు పోలీస్ స్టేషన్‌కు డ్రోన్ కెమెరా


ఎస్పీ దామోదర్‌కు డ్రోన్ కెమెరా అందజేస్తున్న సుబ్బారెడ్డి

కొమరోలు: నేరాల నియంత్రణ కోసం కొమరోలు పోలీసుస్టేషన్‌కు పురుషోత్తమునిపల్లె గ్రామానికి చెందిన ఎస్‌ఆర్‌ఐ ముత్యాల రామిరెడ్డి తన సొంత నిధులతో డ్రోన్ కెమెరా అందజేశారు. రామిరెడ్డి సోదరుడు సుబ్బారెడ్డి ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ దామోదర్‌కు రూ.2 లక్షల విలువ చేసే డ్రోన్ కెమెరాను గురువారం అందించారు. ఈ సందర్భంగా రామిరెడ్డిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య, కొమరోలు ఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్‌ను బడిలో చేర్పించాలి


ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కొమరోలు: మండలంలోని తాటిచెర్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నట్లు చెప్పారు.

పిల్లలను చెరువులు, కుంటలకు పంపవద్దు


అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ, పక్కన హెచ్‌ఎం సుధాకర్, సిబ్బంది

తర్లుపాడు: వేసవి సెలవుల్లో పిల్లలను చెరువులు, కుంటల వద్దకు పంపవద్దని ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులకు తెలియకుండా ఈతకు వెళ్లి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని చెప్పారు. అనుకోకుండా అగ్నిప్రమాదాలు సంభవిస్తే ప్రాణాలు ఎలా కాపాడుకోవాలో వివరించారు. సీపీఆర్ ఎలా చేయాలో తెలిపారు. ఇంట్లో గ్యాస్, విద్యుత్ వాడకంపై జాగ్రత్తగా ఉండాలని, ఈ విషయాలు తల్లిదండ్రులకు కూడా చెప్పాలని సూచించారు. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో రోడ్లపై ఉండవద్దని, విద్యుత్ స్తంభాలు ముట్టుకోవద్దన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్, పాఠశాల చైర్మన్ రాజారాంరెడ్డి, ఉపాధ్యాయులు, తర్లుపాడులోని వివిధ పాఠశాలల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కమనీయం.. బ్రహ్మోత్సవం

కనుల పండువగా చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

- విద్యుత్ కాంతులతో వెలుగులీనుతున్న ఆలయం
- అలరిస్తున్న నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలు
- ప్రత్యేక అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. చెన్నకేశవస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్ల మూలవిరాట్లను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించడంతోపాటు భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తున్నారు. చెన్నకేశవ స్వామివారు నగరోత్సవంలో రోజుకో ప్రత్యేక అలంకారంలో పట్టణంలోని నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. మార్కాపురంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారి ఉత్సవాలను తిలకించేందుకు తరలివస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి పర్యవేక్షిస్తుండగా దాతలు సహకారం అందిస్తున్నారు.


విద్యుత్ కాంతుల మధ్య స్వామివారి ఆలయం


సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు, మహిళలు


సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న భక్తులు, మహిళలు


ప్రత్యేక అలంకారంలో చెన్నకేశవ స్వామి మూలవిరాట్

నాటుసారా నిర్మూలనపై శ్రద్ధ చూపాలి


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు ప్రాంతంలో నాటుసారా నిర్మూలనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్‌నాగరాజు సూచించారు. స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. నాటుసారా నిర్మూలన కోసం ప్రభుత్వం నవోదయం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. నాటుసారా తయారీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. గిద్దలూరు ఎక్సైజ్‌శాఖ స్టేషన్ పరిధిలో 5 గ్రామాలు నాటుసారా తయారు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. గ్రామ స్థాయి, మండల స్థాయి కమిటీల ద్వారా నాటుసారా నిర్మూలనకు ప్రయత్నిస్తున్నామన్నారు. నల్ల బెల్లం అమ్మకాలు నిర్వహించే వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆయన వెంట మార్కాపురం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దాసరి బాలయ్య, సీఐ జయరావు, ఎస్సై రాజారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం


నీటి సరఫరాపై ఎన్‌ఎస్‌పీ ఏఈని ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ రామనారాయణరెడ్డి


సమావేశంలో పాల్గొన్న అధికారులు, సభ్యులు

- అధికారుల పనితీరుపై సభ్యుల అసంతృప్తి

కొనకనమిట్ల:

స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం వాడీవేడిగా సాగింది. సమస్యల పరిష్కారంలో అధికారుల తీరు ఏమాత్రం బాగోలేదని సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులపై స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా ఏ హోదా లేనివారితో నిర్వహిస్తుండటాన్ని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ అధ్యక్షతన ఎంపీడీఓ ఈశ్వరమ్మ నిర్వహించారు. పలువురు ప్రభుత్వ అధికారులు తమ శాఖలకు సంబంధించి మాట్లాడుతుండగా వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, గొట్లగట్టు ఎంపీటీసీ ఉడుముల రామనారాయణరెడ్డి, వద్దిమడుగు ఎంపీటీసీ చక్కెర వెలుగొండయ్య, పలువురు సభ్యులు స్పందించారు. సాగర్ నీరు గ్రామాల్లో సక్రమంగా సరఫరా చేయటం లేదని, సంబంధిత ఎన్‌ఎస్‌పీ ఏఈని ప్రశ్నించారు. వద్దిమడుగు, గనివానిపాడు, బసాపురం, చినారికట్ల గ్రామాలకు సాగర్‌నీరు సరఫరా చేయాలని సభ్యులు కోరగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏఈ శ్రీకాంత్ చెప్పారు. గ్రామాల్లో చేపట్టే ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడుతున్నారని, విచారణ చేపట్టాలని తీర్మానం చేశారు. కూటమి నాయకులు చెప్పినట్లు పనులు చేపడితే సహించేది లేదని వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు ఒక్కసారి కూడా మండల సమావేశానికి రాకపోవడంపై సభ్యులంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. వద్దిమడుగు యూపీ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలని సర్పంచ్ పిన్నిక పిచ్చయ్య కోరారు. ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో ఈ ఏడాది పంటలు సాగు చేసిన రైతులకు నష్టాలు తప్ప లాభాలు రాలేదని అటువంటి రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులను సభ్యులు కోరారు. ఎంపీపీ మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని హితవు పలికారు. ఈఓపీఆర్డీ శ్రీదేవి, ఎంఈఓ డాంగేష రీఫ్, ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, ఏపీఎం సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జ్యోతి సృజన, పీఆర్ ఏఈ శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ వైద్యులు సురేఖ, నరేంద్ర, పశువైద్యాధికారి అమూల్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరిత, ఏపీఓ బుల్లెన్నరావ్, సోషల్ ఫారెస్ట్ రేంజర్ హనూక్‌తో పాటు పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

రాజీ మార్గంలో కేసులు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఓంకార్

గిద్దలూరు రూరల్: రాజీ మార్గం ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించేందుకు ప్రయత్నించాలని గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్ పేర్కొన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో గురువారం న్యాయవాదులకు మే 10వ తేదీన నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులు కక్షిదారులను రాజీమార్గం వైపుగా వెళ్లేందుకు ప్రయత్నించాలన్నారు. ఇరుపార్టీలకు ఆమోదయోగ్యమైన షరతులను అవార్డులతో పొందుపరుచుకోవడం ద్వారా ఇరుపార్టీలు గెలిచినట్లు అని తెలియజేయాలన్నారు. తద్వారా సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో నగర పంచాయతీ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జడ్జి ప్రారంభించారు. కార్యక్రమంలో గిద్దలూరు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరిసారాదానమ్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.శేషశయనారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఉస్మాన్ షరీఫ్, న్యాయవాదులు అంజనీకుమార్, హిమశేఖర్‌రెడ్డి, సంగీతరావు, అహల్య తదితరులు పాల్గొన్నారు.

వెదురు సాగుతో ఆర్థికాభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్

గిద్దలూరు రూరల్: వెదురు సాగుపై అవగాహన అవసరమని డీఆర్‌డీఏ జిల్లా పీడీ పి.డేవిడ్ పేర్కొన్నారు. పట్టణంలోని వెలుగు డీఆర్‌డీఏ కార్యాలయంలో కొమరోలు, రాచర్ల, గిద్దలూరు మండలాల వీఓఏలకు వెదురు సాగుపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వెదురు సాగు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. గిద్దలూరు క్లస్టర్ పరిధిలో 100 మంది మహిళా రైతులను గుర్తించి వారితో వెదురు సాగు చేయించాలన్నారు. ప్రతి మహిళా రైతుకు 30 సెంట్ల భూమిలో 60 మొక్కలు నాటుకునేందుకు వీలుగా అవగాహన కల్పించాలన్నారు. ఆ దిశగా వారు వెదురు మొక్కలను సాగు చేసుకోవడం వల్ల ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతారన్నారు. వెదురుసాగు పూర్తయిన తర్వాత వాటిని మార్కెటింగ్ చేసుకునేందుకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎఫ్‌పీఓ నారాయణరావు, గిద్దలూరు క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ కె.లక్ష్మీరెడ్డి, ఏపీఎంలు కె.నరేష్, పి.రమేష్, రఘు, సీసీలు, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి


ప్లకార్డులు చూపుతూ నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు

మార్కాపురం: నేషనల్ మజ్దూర్ యూనియన్ అథారిటీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రీజినల్ నాయకులు టీఎంకే రావు, బి.నాగిరెడ్డి, ఐఎస్ రెడ్డి, డిపో సెక్రటరీ కాశయ్య తదితరులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు అయిన 1/19 సర్క్యులర్ అమలు చేయాలని, నైటవుట్ అలవెన్సులు పెంచాలని, సిక్ పీరియడ్‌లో పూర్తి శాలరీ ఇవ్వాలని, ఉద్యోగుల ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత విధానాన్నే పునరుద్ధరించాలని, మహిళా ఉద్యోగులకు గవర్నమెంట్ జీఓ ప్రకారం చైల్డ్ కేర్ లీవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్యారేజీ ఉద్యోగుల పెండింగు సమస్యలు పరిష్కరించాలని, నిలిచిపోయిన ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని, రిటైర్డు ఉద్యోగులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. క్యాడర్ స్ట్రెంత్ అమలు చేయాలని, డిప్యుటేషన్ విధానాన్ని కొనసాగించాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అక్రమంగా విధుల నుంచి తొలగించిన వారిని తిరిగి విధుల్లో చేర్చుకోవాలని డిపో సెక్రటరీ కె.కాశయ్య, డిపో అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసులు, గ్యారేజ్ అధ్యక్షుడు కె.రామిరెడ్డి, సెక్రటరీ బీఎస్ఎన్ రెడ్డి, ప్రెసిడెంట్ ఎఫ్.అనీఫ్, సీసీఎస్ డెలిగేట్ ముత్తయ్య కోరారు. ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని టైర్ మెకానిక్‌లు రవి, శివ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిపో కమిటీ, ట్రాఫిక్, గ్యారేజీ సిబ్బంది తదితరులు పాల్గొని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు.

బంగారు బ్యాలం ప్రాజెక్టు జిల్లా నోడల్ ఆఫీసర్‌గా గిరిధర శర్మ


కలెక్టర్ తమీమ్ అన్సారియాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంఈఓ-2 గిరిధర శర్మ

రాచర్ల: జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బంగారు బాల్యం ప్రాజెక్టుకు నోడల్ ఆఫీసర్‌గా రాచర్ల ఎంఈవో-2 వారణాసి గిరిధరశర్మ నియమితులయ్యారు. బాల కార్మికులు, బాల్య వివాహాలు, బడి మానేసిన పిల్లల వివరాలు, పోషకాహార లోపం గల పిల్లలు, జననం, ఆధార్ సంబంధిత సమస్యలు, పిల్లలు ఎదుర్కొంటున్న లైంగిక పీడన చర్యలపై జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని బాధ్యతలు నిర్వహించాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనను మండల అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

రక్తహీనతతో అనారోగ్య సమస్యలు

బేస్తవారిపేట: రక్తహీనతతో అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని సీడీపీఓ నీలోఫర్ బేగం అన్నారు. గురువారం స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాలలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. అధిక పోషక విలువలు కల్గిన చిరుధాన్యాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. యుక్త వయసులో రక్తహీనత బారిన పడకుండా పండ్లు, ఆకుకూరలు, ఐరన్ కలిగిన ఆహార పదార్థాలు, మిల్లెట్స్ ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కిశోర బాలికలకు రక్త పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ అబీబ్‌ఖాన్, కళాశాల ప్రిన్సిపాల్ సత్యవతి, ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: పోషణ్ పక్వాడాపై అవగాహన కల్పించేందుకు స్థానిక సీడీపీఓ బి.జ్యోతి ఆధ్వర్యంలో పట్టణంలోని బీసీ వసతి గృహం వద్ద గురువారం ర్యాలీ నిర్వహించారు. వసతి గృహంలోని విద్యార్థులకు పరిశుభ్రత గురించి వివరించారు. కిశోర బాలికలకు అందించాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆరు నెలల వరకు బిడ్డకు తల్లి తప్పకుండా పాలు అందించాలన్నారు. అప్పుడే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటాడన్నారు. వసతి గృహాల్లో ఉండే బాలికలు బలవర్ధకమైన ఆహారం తీసుకుంటూ ఉన్నత విద్య అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.వసంతకమారి, వార్డెన్ రాధాతేజస్విని, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసు, ఆశావర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.


గిద్దలూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీఓ, కార్యకర్తలు


కిశోర బాలికలకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది